క్లుప్తంగా

వార్డు ఉప ఎన్నికకు సర్వం సిద్ధం



గొరపల్లి ఎంపీపీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం

సింహాచలం: పెందుర్తి మండలం గొర్లపల్లి పంచాయతీలోని నాలుగో వార్డుకు శనివారం జరిగే ఉప ఎన్నికకు సర్వం సిద్ధం చేశారు. స్థానిక ఎంపీపీ స్కూల్లో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరగనుంది. మొత్తం 244 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఎన్నికల రిట్నరింగ్ అధికారి ఎస్.అప్పారావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

నేడు పోలింగ్

పరవాడ: మండలంలోని కన్నూరు గ్రామ పంచాయతీలో 7వ వార్డు సభ్యుడి ఎన్నికకు శనివారం పోలింగ్ నిర్వహించనున్న ఎంపీడీవో వి.హేమసుందర్రావు తెలిపారు. పోలింగ్ 7 నుంచి మధ్యాహ్నం 1 గంట జరుగుతుందని చెప్పారు. పోటీలో మడక అప్పారావు, శీరంశెట్టి సత్తిబాబు ఉన్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఎం.రాధికను నియమించారు. సహాయకులుగా ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను నియమించడం జరిగిందన్నారు. పోలింగ్ అనంతరం కౌంటింగ్ నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో హేమసుందర్రావు తెలిపారు.

విశేషంగా నిత్య కల్యాణం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడామండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. అర్చకుడు శ్రీకాంతాచార్యులు తదితరులు విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు



సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న రాంకీ ఎండీ లాల్‌కృష్ణ తదితరులు

పరవాడ: జేఎస్‌ఫార్మాసిటీలోని రాంకీ కార్యాలయం సమీపంలో కొలువుదీరిన శ్రీగణపతి, సుబ్రమణ్య, శ్రీ చక్రసహిత రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా రెండో రోజు శుక్రవారం వాస్తుమండపారాధన, వాస్తు బలి, వాస్తుహోమం, అష్టోత్తర కలశ ఆరాధన వంటి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో రాంకీ ఎండీ డాక్టర్ లాల్‌కృష్ణ పాల్గొన్నారు.

బ్యాగ్ నూతన అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

ఆనందపురం: బ్రాయిలర్ ఇండస్ట్రీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ విశాఖ (బ్యాగ్) అధ్యక్షుడిగా ఆనందపురానికి చెందిన కొట్యాడ శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పెద్దిపాలెంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా షేక్ పీర్ సాహిబ్(పెందుర్తి), కార్యదర్శిగా చిట్టూరి రామకృష్ణ(మధురవాడ), సంయుక్త కార్యదర్శిగా బి.సతీష్(విశాఖ), కోశాధికారిగా ఎస్.ఎస్.మాధవరావు(విశాఖ) నియమితులయ్యారు. సభ్యులుగా కృష్ణమూర్తి, గోపి, విజయ్, ఎం.రమేష్, కె.రమణ, సుబ్బారావు, సుభాన్, సుధా శ్రీను, లతా శ్రీను, సత్యనారాయణలను ఎన్నుకున్నారు. బ్యాగ్ మాజీ అధ్యక్షుడు మేకా నాగేశ్వరరావు, అశోక్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, వెంకటేశ్వరరావు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ కోళ్ల పెంపకందారులు, వ్యాపారుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. కోళ్ల పెంపకాన్ని ప్రోత్సహించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- మూడు వార్డుల్లో రూ.1.71 కోట్లతో పనులకు శంకుస్థాపన



95వ వార్డులో అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: ప్రజా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా చేసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. పెందర్తి నియోజకవర్గం పరిధిలోని 93,94,95,97వ వార్డుల్లో రూ.1.71కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాప చేశారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం దారా సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నామని చెప్పారు. వచ్చే సోమవారం మరో రూ. 2.51కోట్లతో చేపట్టబోయే పనులకు శంకుస్థాపన చేయనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమాల్లో 95వవార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, 93వవార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా, 94,97వ వార్డుల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు ఆదిరెడ్డి మురళి, మెంటి మహేష్, 93వవార్డు నాయకులు దాసరి అన్నపూర్ణ, దాసరి సత్తిబాబు, చందు యాదవ్, బండి సత్తిబాబు, తామర్ల నర్సింగ్, చిప్పల చందు, అడ్డాల రామరాజు, దాడి నూకరాజు, వినోద్, సంపత్ వర్మ, జీవీఎంసీ జోన్-8 కమిషనర్ మల్లయ్యనాయుడు, శంకర్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆత్మకూరి కృష్ణకుమార్, జీఎం కె.రాధాకృష్ణన్, డీజీవీవ బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేసిన పనుల వివరాలు

- రూ. 8.25 లక్షలతో 93వ వార్డులోని ఈస్టుపాయింట్‌కాలనీలో ఎస్.డబ్ల్యూ డ్రైన్స్ నిర్మాణం.
- గణేష్‌కాలనీలో రూ.5.21లక్షలతో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు, పైపు కల్వర్ట్స్ నిర్మాణం
- ఈస్టుపాయింట్ కాలనీ ఫేజ్-3లో రూ.6.54లక్షలతో సీసీ రోడ్లు, కల్వర్టులు, డ్రైన్ల మరమ్మతులు.
- గొల్లనారాయణపురంలో రూ.9.32లక్షలతో సీసీ రోడ్లు,సీసీ డ్రైన్ల నిర్మాణంతో పాటు డ్రైన్ల మరమ్మతులు.
- శ్రీనివాసనగర్‌లో రూ. 8.29 లక్షలతో ఇంటర్నల్ సీసీ రోడ్లు, భరత్‌నగర్‌లో రూ.2.39 లక్షలతో సీసీ డ్రైన్లు, బాలాజీ గార్డెన్స్‌లో రూ.6.04 లక్షలతో నిర్మించనున్న ఎస్‌డబ్ల్యూ డ్రైన్‌కి శంకుస్థాపన చేశారు.
- రూ.19.93 లక్షలతో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వద్ద నిర్మించనున్న బీట్ రోడ్డుతో పాటు రూ. 8.05లక్షలతో వెంకటాద్రినగర్‌లో నిర్మించనున్న వీసీసీ కెర్బ్ వాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు.

94వవార్డు పరిధిలో..

ఆర్.ఆర్.వెంకటాపురంలోని పలు ప్రాంతాల్లో రూ.3.82లక్షలు, రూ.2.96లక్షలు, రూ.2.46 లక్షలతో సీసీ డ్రైన్ల మరమ్మతులతో పాటు రూ.4.72 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ పనులకు శంకుస్థాపన చేశారు.

95వ వార్డు పరిధిలో..

- పాపయ్యరాజుపాలెం బీసీ కాలనీలో రూ.3.34లక్షలతో ఇంటర్నల్ సీసీ రోడ్డు పనులకు, ఆర్టీసీ కాలనీలో శివాలయం వద్ద రూ.2.79లక్షలతో రిటైనింగ్ వాల్ నిర్మాణంతో పాటు రూ.10.15 లక్షలతో గాయత్రీనగర్‌లో కొత్త సీసీ రోడ్డు పాపయ్యరాజుపాలెంలో రూ.4.98లక్షలతో సీసీరోడ్లు నిర్మాణం.

97వవార్డు పరిధిలో..

సుజాతనగర్‌లోని గోపాలకృష్ణనగర్, విరాట్‌నగర్‌లో రూ.20 లక్షలతో ఎస్‌డబ్ల్యూ డ్రైను, కల్వర్టులు, ఇంటర్నల్ డ్రైన్లు.

- కిషోర్ లేఅవుట్‌లో రూ.9.53 లక్షలతో సీసీ డ్రైను, చాణక్యనగర్ తదితర ప్రాంతాల్లో రూ.10.47లక్షలతో నిర్మించనున్న ఎస్‌డబ్ల్యూ డ్రైన్, కల్వర్టు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

విద్యాభివృద్ధికి సీఎస్సార్ నిధులు వినియోగించండి

కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



ఆధునికీకరించిన పరవాడ బాలికల వసతిగృహాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

పరవాడ: ప్రభుత్వ విద్యాలయాలు.. వసతి గృహాల ఆధునికీకరణకు సీఎస్సార్ నిధులు వెచ్చించాలని పరిశ్రమల యాజమాన్యాలను కలెక్టర్ రవిపట్టాన్ శెట్టి కోరారు. జేఎస్ ఫార్మాసిటీలో యుజియా ఫార్మా స్పెషాలిటీస్ (అరబిందో అనుబంధ సంస్థ) పరిశ్రమ సీఎస్సార్ నిధులు రూ.50 లక్షలతో ఆధునికీకరించిన పరవాడ బీసీ బాలికల వసతి గృహాన్ని శుక్రవారం ప్రారంభించారు. అలాగే తానాం బాలుర బీసీ వసతి గృహాల ఆధునికీకరణ పనులయకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి మాట్లాడుతూ సీఎస్సార్ నిధులు విరివిగా వెచ్చించి విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించడానికి ఫార్మా పరిశ్రమల యాజమాన్యాలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. యుజియా పరిశ్రమ యాజమాన్యానికి ఆయన అభినందనలు తెలిపారు. అనంతరం అరబిందో పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ నిత్యానందరెడ్డి మాట్లాడుతూ సీఎస్సార్ నిధులతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని కలెక్టర్‌కు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.హేమసుందర్రావు, ఈవోఆర్డీ పద్మజ, సోషల్ వెల్ఫేర్ అధికారులు, వార్డెన్లు, పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్ కుటుంబానికి సాయం

డీఎంహెచ్‌వో చేతుల మీదుగా రూ.1.68 లక్షల అందజేత



మృతి చెందిన హెల్త్ అసిస్టెంట్ కుటుంబానికి చెక్కు అందిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మద్దిలపాలెం : ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్ పుట్టా రాజేంద్ర ప్రసాద్ కుటుంబానికి సహచర కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లు, ఏపీఎన్‌జీవో నాయకులు రూ.1.68 లక్షలు ఆర్థిక సాయం అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా వున్న కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్ల నుంచి రూ.1.18 లక్షలు, మృతుడు పనిచేసిన పెందుర్తి ఆరోగ్యకేంద్రం సిబ్బంది రూ.40 వేలు, ఏపీఎన్‌జీవో నాయకులు రూ.10 వేలు సేకరించి ఆ మొత్తాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు చేతుల మీదుగా శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ అకస్మాత్తుగా మరణించిన తమ సహచరుని కుటుంబానికి అండగా నిలిచిన సిబ్బంది తీరును అభినందించారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం తరపున సాయం అందేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ఏపీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు మాట్లాడుతూ కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లకు ఏ కష్టమొచ్చినా సాయం చేసేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు.

నవరత్నాలతో ప్రతి ఇంటికీ లబ్ధి

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



గాలిభీమవరంలో మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నవరత్నాలతో ప్రతి ఇంటికీ లక్షలాది రూపాయిలు అందించి ఆర్థికంగా చేయూత ఇచ్చారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మండలంలోని గొటివాడ సచివాలయం పరిధిలోని గాలిభీమవరం, పల్లవానిపాలెం,జాగరపువానిపాలెం గ్రామాల్లో శుక్రవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని గణంకాలతో వివరించారు. ప్రతి సమస్యను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా పలువురు ఓటీఎస్ లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు అందజేశారు. జాగరపువానిపాలెం జలజీవన్ మిషన్ పథకంలో ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్, పార్టీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు కొటాన రాము, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, గ్రామ సర్పంచ్ గోర్లి రాజేష్,మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు, మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, సర్పంచ్‌లు బోకం స్వామినాయుడు, పిల్లల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ప్రగతికి అంతర్గత ప్రేరణ కీలకం



వీసీ ప్రసాదరెడ్డిని సత్కరిస్తున్న నిర్వాహకులు

ఏయూ క్యాంపస్: అంతర్గత ప్రేరణే వ్యక్తి ప్రగతిలో కీలకమని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి అన్నారు. ఏయూ స్నాతకోత్సవ మందిరంలో ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ స్థాయి సీఏ విద్యార్థుల సదస్సు సంకల్ప్-23ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ యువత కొత్త ఆలోచనలు దేశానికి పెద్ద సంపదగా మారనున్నాయన్నారు. ప్రపంచం శరవేగంగా మార్పులకు లోనవుతోందని, అన్ని రంగాలు తదనుగుణంగా మారాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్ఎస్ఈబీ చైర్మన్ మంగేష్ పి కినరే మాట్లాడుతూ నూతన కరిక్యులంను అమలు చేస్తున్నామన్నారు. విదేశాల్లో కూడా తమకు 45 శాఖలు ఉన్నాయని, ప్రత్యక్ష శిక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఉపాధ్యక్షుడు శ్రీధర్ మప్పల మాట్లాడుతూ సీఏ వృత్తిలో అడుగిడటం విజయానికి ఆరంభంగా మాత్రమే భావించాలన్నారు. సదస్సు సంచాలకుడు డి.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ భవిష్యత్‌కు అవసరమైన బలమైన పునాదులు నిర్మించుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్‌సీ, సికాస చైర్మన్ ఆర్.చెంగల్‌రెడ్డి ఏకాగ్రతతో పనిచేయడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సికాస చైర్మన్ స్వరూప్, వైస్ చైర్మన్ పి.నాని కార్తీక్, విశాఖ ప్రాంతీయ కేంద్రం చైర్మన్ ప్రసాద్ కె.పాండ, పెద్ద సంఖ్యలో సీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రావణ మాస పూజలు



సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు



దేవీపురంలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు



కరెన్సీనోట్ల అలంకరణలో కనకదుర్గ అమ్మవారు



శ్రావణ మాస పూజల్లో పాల్గొన్న మాతృమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామ పొలిమేర దేవత సత్తెమ్మ తల్లి ఆలయంలో శ్రావణ శుక్రవారం పూజలు విశేషంగా జరిగాయి. కుంకుమ పూజల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షుడు వెంకట్రావు, కార్యదర్శి గంట్ల కనకరాజు, సంయుక్త కార్యదర్శి బలిరెడ్డి శ్రీను ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- జీవీఎంసీ 97వవార్డు సప్తగిరినగర్‌లోని అలివేలు మంగాదేవి ఆలయంలో శ్రావణ శుక్రవారం పూజలు విశేషంగా నిర్వహించారు. ఉదయం ఆరాధన, నక్షత్ర హారతి, లక్ష్మీసహస్రనామ పారాయణ నిర్వహించారు.
- శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని ఎస్ఆర్‌పురంలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని కరెన్సీ నోట్లతో లక్ష్మీదేవిగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కుంకుమ పూజలు నిర్వహించారు.

వెంకన్న ఆలయంలో

శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కుంకుమ పూజలు జరిగాయి. ఆలయ అర్చకుడు భార్గవ్ భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. సాయంత్రం స్వామివారి దర్శనానికి భక్తులు పోటెత్తారు.

పరవాడ: శ్రావణమాస పూజలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో లంకెలపాలెం రామాలయంలో మాతృమూర్తులు కలశ యాత్ర, కుంకుమార్చన నిర్వహించారు.

దేవీపురంలో..

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి క్షేత్రంలో శ్రావణ మాసోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీయంత్ర మహామేరు ఆలయంలో ఈశాన్య దిక్కులో కొలువైన శ్రీమహాలక్ష్మి అమ్మవారికి పూజలు,అభిషేకాలు నిర్వహించారు. గురుమాత అన్నపూర్ణమ్మ భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

బీజేపీ రాష్ట్ర కోశాధికారిగా నాగేంద్ర

ఎంవీపీ కాలనీ: బీజేపీ రాష్ట్ర కోశాధికారిగా ఎం.నాగేంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షురాలు దుగ్గుబాటి పురందేశ్వరి నియామక పత్రం జారీ చేసినట్టు ఆ పార్టీ విశాఖ కార్యాలయం వెల్లడించింది. ఈ సందర్భంగా నాగేంద్రకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున అభినందనలు తెలిపారు.

మెడికవర్‌లో అరుదైన రోబోటిక్ సర్జరీ



సర్జరీ అనంతరం కోలుకున్న నరేష్‌తో డాక్టర్ కార్తీక్ చంద్ర వల్లం, తదితరులు

ఎంవీపీ కాలనీ: మెడికవర్ ఆస్పత్రి వైద్యులు ఓ రోగికి అరుదైన రోబోటిక్ సర్జరీ విజయవంతంగా పూర్తి చేశారు. ఈ మేరకు ఆస్పత్రి యాజమాన్యం శుక్రవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖ జిల్లాకు చెందిన జి.నరేష్(36) తీవ్ర జ్వరంతో పాటు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు కారణంగా ఎంవీపీ కాలనీలోని మెడికవర్ ఆస్పత్రి ఎమర్జెన్సీ విభాగంలో చేరాడు. ఆయన్ను పల్మోనాలజిస్ట్ డాక్టర్ సుధీర్ తాలే పరీక్షించి క్షయవ్యాధి కారణంగా ఊపిరితిత్తుల చుట్టూ(ప్లూరల్ ఎఫ్యూషన్) నీరు ఉందని గుర్తించారు. శస్త్ర చికిత్స ద్వారా ఆ నీరును తొలగించాలని సూచిస్తూ రోబోటిక్, లాపరోస్కోపిక్ సర్జన్ డాక్టర్ కార్తీక్ చంద్రకు రిఫర్ చేశారు. అనంతరం వీఏటీఎస్(థొరాకోస్కోపిక్) డెకార్టికేషన్ రోబోటిక్ సర్జరీ ద్వారా ఊపిరితిత్తుల విస్తరణను నిరోధించే కణజాల పొరతో పాటు ఊపిరితిత్తుల చుట్టూ ఉన్న నీరును తొలగించారు. శరీరంపై 5-6 సెంటీమీటర్ల చిన్నపాటి రంధ్రం ద్వారా సున్నితమైన ఈ సర్జరీని డాక్టర్ కార్తీక్ చంద్ర బృందం విజయవంతంగా పూర్తి చేసింది. రోగి వేగంగా కోలుకుని, 4 రోజుల్లోనే డిశ్చార్జ్ అయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కార్తీక్ చంద్ర బృందాన్ని ఆస్పత్రి వర్గాలు అభినందించాయి.

అలంకార ప్రాయంగా రక్షిత భవనాలు !

- నిర్వహణ లేకపోవడమే కారణం
- నెరవేరని ప్రభుత్వ లక్ష్యం



జాలరిపేట తుపాను రక్షిత భవనం చుట్టూ పెరిగిన తుప్పలు

పరవాడ: ప్రకృతి విపత్తుల సమయాల్లో సముద్ర తీర ప్రాంత ప్రజలను ఆపద నుంచి రక్షించేందుకు నిర్మించిన తుపాను రక్షిత భవనాల లక్ష్యం నెరవేరడం లేదు. వాటి ఆలనాపాలనా చూసే నాథుడు లేక శిథిలావస్థకు చేరుతున్నాయి. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతుంది. పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం, జాలరిపేట గ్రామాల్లో తుపాను రక్షిత భవనాలను కోట్లాది రూపాయిలతో నిర్మించారు. నిర్వహణ లేక రక్షిత భవనాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. ఈ తరుణంలో మరమ్మతులు చేపట్టాలని మత్స్యకారులు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి

- ముత్యాలమ్మపాలెం శివారు జాలరిపేటలో 2017లో రూ.1.11 కోట్ల వ్యయంతో నిర్మించిన తుపాను రక్షిత భవనం తుప్పల మధ్య కొట్టుమిట్టాడుతుంది.
- భవనం ఆలనాపాలనా చూసే నాథుడు లేక చెత్తా చెదారాలతో నిండి ఉంది.
- భవనంలోని ఓ గదిలో ఎలిమెంటరీ పాఠశాల నడుపుతున్నారు. మిగిలిన గదులన్నీ నిరుపయోగంగా ఉన్నాయి.
- మంచినీటి బోరు, సోలార్ లైట్లు, తుపాను హెచ్చరిక యంత్ర సామగ్రి మూలకు చేరాయి.
- భవనానికి చిన్న చిన్న మరమ్మతులు నిర్వహిస్తే ప్రజోపయోగ కార్యక్రమాలకు ఉపయోగించుకోవచ్చునని స్థానికులు అంటున్నారు.

ముత్యాలమ్మపాలెం తీరంలో...

ముత్యాలమ్మపాలెం తీరంలో 2017లో దాదాపు రూ.1.42 కోట్ల వ్యయంతో నిర్మించిన తుపాను రక్షిత భవనం శిథిలావస్థకు చేరింది.

- భవనం చుట్టూ రక్షణ గోడ లేక పోవడంతో భవనం లోపల చెత్తా చెదారాలతో నిండిపోయింది. భవనానికి అమర్చిన ఇనుప గేట్లు తుప్పుపట్టి విరిగిపోయాయి.
- విద్యుత్ సామగ్రి పనికిరాకుండా పోయింది. మంచినీటి బోరు మూలకు చేరింది. మత్స్యకారులు భవనంలో వేట సామగ్రి భద్రపర్చుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు.
- తుపాను హెచ్చరికలు తెలియజేసే యంత్రపరికరాలు, సోలార్ లైట్లు నిరుపయోగంగా పడి ఉన్నాయి.
- భవనంపై ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకు పెచ్చులూడుతుంది. ద్వార బంధాలు, కిటికీలు చోరులపాలవుతున్నాయి.
- ప్రస్తుతం భవనాన్ని మత్స్యకార్మికులు వలలు అల్లుకోవడానికి వినియోగిస్తున్నారు.
- తుపాను రక్షిత భవనాల నిర్వహణ బాధ్యతను మహిళా మండళ్లకు అప్పగించినప్పటికీ ఫలితం కనిపించలేదు.

తిక్కవానిపాలెంలో..

తిక్కవానిపాలెంలో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన తుపాను రక్షిత భవనం పేకాటరాయుళ్లకు ఆవాసంగా మారింది.

- విద్యుత్ మోటారు, లైట్లు రిపేర్లతో మూలుగుతూ గోడలకు వేలాడుతున్నాయి.



నిరుపయోగకంగా తుపాను హెచ్చరిక యంత్ర పరికరాలు

- బిల్లులు చెల్లించని కారణంగా విద్యుత్ కనెక్షన్ తొలగించారు.
- భవనం లోపల పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగి అధ్వానంగా తయారైంది.

దివ్యాంగుల మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన దివ్యాంగుల మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయ్‌మెంట్ (క్లరికల్) అధికారి సీహెచ్.సుబ్బిరెడ్డి తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, యూత్ ఫర్ జాబ్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ మేళా నిర్వహించినట్లు తెలియజేశారు. ఫైజర్ ఇండియా, ఏషియన్ పెయింట్స్, ఇండిగో ఎయిర్ లైన్స్, వింధ్యా ఇ- ఇన్ఫోమీడియా, సెంట్రల్ ఫార్మసీ, బీపీసీఎల్, నవత రోడ్ ట్రాన్స్‌పోర్ట్, మాక్స్ ఫ్యాషన్, ఫ్లిప్‌కార్ట్, రిలయన్స్ ట్రెండ్స్, పలు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 457 ఖాళీల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూలకు 253మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. వారిలో 64మంది ఎంపికయ్యారన్నారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించి, అభ్యర్థులకు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి సుబ్బిరెడ్డి నియామక పత్రాలు అందించారు. ఉపాధి శిక్షణ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.నవ్య, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మాధవీ లత జాబ్‌మేళాలో అభ్యర్థులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రైవేటు కంపెనీలను ప్రోత్సహించడంతో ఆయా కంపెనీలు నేరుగా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.